ప్రజాశక్తి
బుధవారం 5 మార్చి 2025
5
విజయనగరం

ఇంగ్లీషు పరీక్షకు 922 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మంగళవారం జరిగిన మొదటి ఏడాది ఇంటర్ ఇంగ్లీషు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 22114 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా వారిలో 21,192 మంది హాజరుకాగా, 922 మంది పరీక్షకు హాజరు కాలేదు. జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష జరిగిందని ఆర్ఐఒ ఎం.ఆదినారాయణ తెలిపారు.

కనుమరుగు కానున్న మాధవరాయమెట్ట ప్రాథమిక పాఠశాల

నూతన విద్యా విధానం అమలుకు కూటమి ప్రభుత్వం పావులు కదుపుతోంది. దీంతో భవిష్యత్తులో ప్రాథమిక బడి కనుమరుగయ్యే ప్రమాదం ఉందని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఒకే పంచాయతీలో ఉన్న ప్రాథమిక బడుల నుంచి 3,4,5 తరగతులను మోడల్ ప్రైమరీ స్కూళ్ల పేరిట విలీయం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగానే పాఠశాల విద్యాకమిటీల ఆమోదాన్ని తీసుకోవాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. అయితే గ్రామంలో పాఠశాల విద్యార్థులను మోడల్ ప్రైమరీ పాఠశాలలకు పంపేందుకు తల్లిదండ్రులు వ్యతిరేకిస్తున్నారు.

ప్రాథమిక బడులు విచ్ఛిన్నం

- మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటుకు కసరత్తు
- వ్యతిరేకిస్తున్న విద్యా కమిటీలు
- క్లస్టర్ విధానంతో భవిష్యత్తు బడి కనుమరుగు
- ఖాళీ కానున్న ఉపాధ్యాయ పోస్టులు
- దొడ్డిదారిన ఎన్ఇపి అమలు

ప్రజాశక్తి-జామి

జామి మండలంలో 50 ప్రభుత్వ బడుల్లో సుమారుగా 2,780మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి సుమారు 200కు పైగా ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తున్నారు. నూతన విద్యా విధానం అమల్లో భాగంగా ప్రాథమిక బడుల ఉనికిని కనుమరుగు చేసే చర్యలకు నాడు వైసిపి ప్రభుత్వం, నేడు టిడిపికూటమి ప్రభుత్వం పూనుకున్నాయి. గత ప్రభుత్వం అమలు చేసిన 117జీవోను రద్దు చేసి, ఫౌండేషన్ బడులు ఏర్పాటు చేస్తున్నామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. కానీ 117 జీవోనే దొడ్డిదారిన అమలు చేసేందుకు సిద్ధమైంది. అందులో భాగంగానే ఒకే పంచాయతీలో ఉన్న ప్రాథమిక బడుల్లో 3,4,5 తరగతులను వేరు చేసి, ఒక మోడల్ ప్రైమరీ పాఠశాలలో కలిపేయాలని ప్రతిపాదనలు సేకరిస్తుంది. ఈ లెక్కన మండల కేంద్రమైన జామి మాధవరాయమెట్ట ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతి విద్యార్థులను నెయ్యిల వీధి మోడల్ ప్రైమరీ స్కూలులో విలీనం చేసేందుకు రంగం సిద్ధం చేసింది. అదే జరిగితే, నేషనల్ హైవే దాటి, రెండు కిలోమీటర్ల దూరం విద్యార్థులు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. అందుకు అక్కడ తల్లిదండ్రులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. భీమసింగి పంచాయతీలో పాఠశాల విషయమై, చెరువులోపల, యాతపాలెం, చిల్లపాలెం బడుల నుంచి 3,4,5 తరగతులను తరలించే ప్రతిపాదనలను విద్యా కమిటీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. లొట్లపల్లి మోడల్ ప్రైమరీ స్కూల్‌కు అలమండ సంత, లొట్లపల్లి పాఠశాలల విద్యార్థులను తరలించేందుకు సిద్ధం చేశారు. కానీ అక్కడ అదే పరిస్థితి. మరోవైపు మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటు ప్రక్రియలో సుమారుగా 15 నుంచి 20మంది వరకు టీచర్ పోస్టులు ఖాళీ కానున్నాయి. ఆ సంగతి అటుంచితే, మోడల ప్రైమరీ స్కూళ్ళ ఏర్పాటు పేరుతో విద్యార్థులకు చేరువుగా ఉన్న ప్రస్తుత ప్రాథమిక పాఠశాలలను బేసిక్ ప్రాథమిక పాఠశాలలు (బిపిఎస్)గా మార్చి, భవిష్యత్తులో వాటి ఉనికిని దెబ్బతీసే ప్రమాదం పొంచి ఉందని మేథావులు అంటున్నారు.

ప్రాథమిక బడులకు ప్రమాదం

కూటమి ప్రభుత్వం చెబుతున్నట్లు ప్రాథమిక బడులను పెద్ద ఎత్తున బేసిక్ ప్రాథమిక బడులుగా మారడం ఖాయం. దీంతో కొద్ది రోజులకు ప్రాథమిక ఉనికిని దెబ్బతీసి భవిష్యత్తులో వాటిని కనిపించకుండా చేయడమే ఎన్ఇపి ఉద్దేశం. బేసిక్ బడులుగా మారిస్తే, మండలంలో చింతాడ, పావాడ, జాగారం ఇలా సగానికి పైగా, ప్రాథమిక పాఠశాలల్లో పెద్ద ఎత్తున విద్యార్థులు ఖాళీ అవుతారు. ఆ తరువాత విద్యార్థులు లేరన్న సాకుతో వాటికి సులువుగా మూసేయ్య వచ్చన్నది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. ఈ నేపథ్యంలోనే విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

సమగ్ర చర్చ జరగాలి

ప్రభుత్వం 117 జీవోను రద్దు చేసి, మోడల్ ప్రైమరీ బడులు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రజల్ని నమ్మించడం బూటకం మాత్రమే. ఎన్ఇపి అమల్లో భాగంగా చేస్తున్న ఈ చర్యలపై మేధావులు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలతో సమగ్ర చర్చ జరపాలి. విద్యను ఆర్థిక లాభాల కోణంలో చూడగూడదు. దళిత, గిరిజన, పేదల కుటుంబాలకు దోహదపడే ప్రాథమిక బడుల ఉనికిని రకరకాల పేర్లతో దెబ్బతీయడం వారికి విద్యను దూరం చేయడం తప్ప మరొకటి కాదు. ఇప్పటికైనా ప్రభుత్వ ఆలోచన మారాలి.

- జెఎవిఆర్ కె ఈశ్వర్రావు,
యుటి ఎఫ్ జిల్లా ప్రదాన కార్యదర్శి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

డ్రగ్స్ నియంత్రణకు అవగాహనే మార్గం

- విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్ లు
- పాఠశాలలు, కళాశాలల్లో డ్రాప్ బాక్స్‌లు
- 1972 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలి
- కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణకు ప్రతీఒక్కరికీ అవగాహన కల్పించడమే ఏకైక మార్గమని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పష్టం చేశారు. డ్రగ్స్ వినియోగంవల్ల కలిగే దుష్ఫలితాలను పెద్ద ఎత్తున వివరించడమే కాకుండా, జిల్లాలో పూర్తిస్థాయి నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా స్థాయి నార్కోటిక్స్ కంట్రోల్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో మంగళవారం జరిగింది.
ముందుగా ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ, జిల్లాలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలను అరికట్టడానికి తీసుకున్న చర్యలను వివరించారు. జిల్లాలో ఎక్కడా గంజాయి పంట సాగు జరగడం లేదని తెలిపారు. జిల్లా మీదుగా రవాణా జరుగుతోందని, దీనిని అరికట్టేందుకు పటిష్టమైన చర్యలను తీసుకున్నామని చెప్పారు. నమోదు చేసిన కేసుల సంఖ్యే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. స్థానికులతోపాటు ఎక్కువగా ఒడిషా గ్యాంగులు గంజాయిని రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఇలాంటి వారిని గుర్తించి అరెస్టు చేయడంతోపాటు, వారి ఆస్తులను కూడా జప్తు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో నాలుగు శాశ్వత చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, వాహనాల తనిఖీని ముమ్మరం చేశామని చెప్పారు. సంకల్పం కార్యక్రమం ద్వారా విస్తత స్థాయిలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. వివిధ ప్రభుత్వ శాఖల సహకారంతోనే పూర్తి స్థాయిలో డ్రగ్స్‌ను అరికట్టవచ్చునని ఎస్‌పి సూచించారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, జిల్లాలో డ్రగ్స్‌ను పూర్తి స్థాయిలో నివారించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతీ విద్యాసంస్థలో అవగాహనా కార్యక్రమాలను విస్తతం చేయాలన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో ఈగిల్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ పాఠశాల, కళాశాలలో రెండు వారాల్లోగా డ్రాప్ బాక్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వారం రోజుల్లోగా డీ అడిక్షన్ సెంటర్‌ను పూర్తి స్థాయిలో వసతులు కల్పించి, వినియోగంలోకి తీసుకురావాలని చెప్పారు. డ్రగ్స్ వినియోగం, రవాణాపై నిఘాను పెంచి, అరికట్టేందుకు మరింత సమర్ధవంతంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదులు చేసేందుకు ఏర్పాటు చేసిన 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కు విస్తత ప్రచారం కల్పించాలన్నారు. ఆర్‌టిసి డ్రైవర్లు, కండక్టర్లకు సైతం గంజాయి అక్రమ రవాణాపై అవగాహన కల్పించి, దానిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.ఎఎస్‌పి సౌమ్యలత, ఇన్‌ఛార్జి జెసి ఎస్.శ్రీనివాసమూర్తి, జెడిఎ విటి రామారావు, జెడ్‌పి సిఇఒ వెంకటరామన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనాధుడు, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ జీవనరాణి, డిఎస్‌డబ్ల్యూఒ రామానందం, డిబిసిడబ్ల్యూఒ పెంటోజీరావు, వయోజనవిద్య డిడి సోమేశ్వర్రావు,ఆర్‌డిఒలు, డిఎస్‌పిలు పాల్గొన్నారు.

కూటమి పతనం ఉత్తరాంధ్ర నుంచే ప్రారంభం

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

సమావేశంలో క్లిప్పింగ్‌లు చూపిస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టిడిపి కూటమి ప్రభుత్వం పతనం ఉత్తరాంధ్ర నుంచి ప్రారంభం అయ్యిందని, అందుకు నిదర్శనం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ఓడిపోవడమేనని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ఎంఎల్‌సి అభ్యర్థికి 30 శాతానికి మించి ఓట్లు పోలు అవ్వలేదన్నారు. ఉపాధ్యాయుల తీర్పు అంటే ప్రజల తీర్పుకు అద్దం పడుతుందన్నారు. ఉపాధ్యాయులకు జీతాలు సకాలం లో ఇవ్వడం లేదు, బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని అన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తూ ప్రభుత్వం తప్పులు చేస్తుందన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కూటమి అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు ఓటు వేయమని సమావేశాలు పెట్టారని, మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయన తరపున ప్రచారం చేశారని తెలిపారు. కానీ ఓడిపోయిన తరువాత రఘువర్మ కూటమి అభ్యర్థి కాదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి ద్వంద నీతికి ఇదినిదర్శనమన్నారు.

ఉద్యోగుల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకతకు నిదర్శనం

ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యోగుల్లో టిడిపి ప్రభుత్వం పట్ల వ్యతిరేకత వ్యక్తమైందని వైసిపి ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం జిల్లా అధ్యక్షులు డోల మన్మధకుమార్ అన్నారు. కూటమి నాయకులు ఎన్ని కుయుక్తులు పన్నినా ఉపాధ్యాయులు దాన్ని తిప్పి కొట్టి 9 నెలల కూటమి ప్రభుత్వం పాలన పట్ల వారికున్న అసంతృప్తిని ఓటు ద్వారా తెలిపారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగులు, పెన్షనర్లకు బకాయిపడ్డ మూడు డిఎలు, జిపిఎస్, పి ఎఫ్, ఇతర బకాయిలు చెల్లిస్తామని చెప్పిన టిడిపి ప్రభుత్వం ఆ హీమిని నెరవేర్చకపోవడం పట్ల ఉద్యోగుల్లో అసంతృప్తి నెలకొందని తెలిపారు. ఎమ్మెల్సీగా గెలుపొందిన శ్రీనివాసులనాయుడు ఉపాధ్యాయ సమస్యల పట్ల పోరాటాలు సాగిస్తూ ఉ విద్యారంగంలో మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని తెలిపారు. ఆయనకు వైసిపి తరపున పూర్తిసహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.

ఎన్నికల కోడ్ ఎత్తివేత

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వెల్లడవ్వడంతో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఎత్తివేస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచేసినట్లు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు.

డ్రగ్స్‌పై ఫిర్యాదులకు 1972కు కాల్ చేయండి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం, సరఫరాను నియంత్రించేందుకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే నిమిత్తం టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఎక్కడైనా మత్తు పదార్థాల వినియోగం, సరఫరా జరుగుతున్నట్లు తెలిస్తే 1972 టోల్ ఫ్రీ నెంబరుకు తెలియజేయాలని కోరారు. జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా నిలిపేందుకు ప్రజలు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పవర్ లిఫ్టింగ్‌లో క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల మార్చి 1,2 తేదీల్లో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీలో 4వ రాష్ట్ర డెడ్ లిఫ్ట్ ఛాంపియన్ షిప్, బెంచ్ ప్రెష్ ఛాంపియన్ షిప్ 2025 లో కె.జగదీష్ 56 కేజీల విభాగంలో బెంచ్ ప్రెష్ 87.5 కేజీల విభాగంలో బంగారు పతకం , 195 కేజీల డెడ్ లిఫ్ట్ విభాగంలో బంగారు పతకం గెలించి స్ట్రాంగ్ మెన్ గా నిలిచారు. ఎ.రాజా 66 కేజీల విభాగంలో వెయిట్ లిఫ్టింగ్ 205 కేజీల డెడ్ లిఫ్ట్ లో బంగారు పతకం, ఎం వెంకటేష్ 74 కేజీల విభాగంలో, 92 కేజీల బెంచ్ ప్రెష్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. వీరిని జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి శంకరరావు,కోరాడ శ్రీనివాసరావు అభినందించారు.

మూడో రోజూ పోటెత్తిన యాత్రికులు

ఆలయంలో ఎంపి కలిశెట్టి కుటుంబీకులను సత్కరిస్తున్న ఆలయ అధికారులు

ప్రజాశక్తి-చీపురుపల్లి

కనకమహలక్ష్మి అమ్మవారి జాతరలో మూడో రోజు మంగళవారం కూడా పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఉదయం ఆరు గంటల నుండే భక్తుల రావడంతో ఆలయ ఇఒ భక్తులకు ఏర్పాట్లు చేశారు. వారి కోసం ప్రత్యేకంగా తాగు నీరు, స్థానిక కళింగ కోమటి సంఘం వారు మజ్జిగను పంపిణీ చేశారు.

కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

కనక మహాలక్ష్మి అమ్మవారి జాతర నేపథ్యంలో పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేయించారు. విజయనగరంఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, మాజీ ఎంపి బొత్స ఝాన్సీ లక్ష్మి, ధీరా ఫౌండేషన్ అధ్యక్షుడు బొత్స సందీప్ , ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్ సి గాదె శ్రీనివాసులనాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అక్రమ మార్గంలో దర్శనం

జాతర సందర్భంగా టిక్కెట్లు ద్వారా ఆలయానికి రావలసిన ఆదాయానికి భారీ గండి పడింది. ఆదివారం నుండి జరుగుతున్న జాతరకు సంబంధించి మొదటి రోజు సుమారు 30 వేల మంది వరకు అమ్మవారిని దర్శించుకున్నారు. అయితే టిక్కెట్లు ద్వారా పదివేల మంది భక్తులు, ఉచిత దర్శనం ద్వారా పదివేల మంది అమ్మవారిని దర్శించుకోగా మరో పది వేల మంది విఐపిలమంటూ అక్రమ మార్గంలో దర్శనాలు చేసుకున్నారంటూ ఆలయానికి వచ్చిన భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండవ రోజు కూడా టిక్కెట్ల ద్వారా 4,248 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోగా ఉచితంగా 5వేల మంది భక్తులు, అక్రమ మార్గం ద్వారా విఐపిలమని చెప్పుకుంటూ మరో రెండు వేల మంది అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ఆలయానికి రావలసిన ఆదాయం తగ్గిందని స్థానికులు అంటున్నారు. గత 26 ఏళ్ల నుండి ఏటా ఆలయానికి ఆదాయం పెరుగుతూ వచ్చేది. కానీ ఈ 27వ వార్సికోత్సవం మాత్రం అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు ఎక్కువగా వచ్చినప్పటికీ అక్రమ మార్గంలో జనాలను పంపించడంతో ఆలయానికి వచ్చిన ఆదాయం తగ్గిందని ఆలయ అధికారులు అంటున్నారు.

ఆకట్టుకున్న వినోద కార్యక్రమాలు

కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకు వచ్చే భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినోద కార్య క్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఆదివారం రాత్రి పది గంటల నుండి మూడు గంటల వరకు వివిధ రకాలైన పౌరాణిక, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించడంతో జాతరకు వచ్చిన యువత ఉర్రూతలూగారు.

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న డిటిసి మణికుమార్

వాహనదార్లకు హెల్మెట్ తప్పనిసరి : డిటిసి

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలోని ద్విచక్ర వాహన చోదకులంతా వాహనం నడిపేటపుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఉప రవాణా కమిషనర్ డి.మణికుమార్ విజ్ఞప్తి చేశారు. జిల్లాలో మంగళవారం రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించి హెల్మెట్ ధరించని 30 మంది వాహన చోదకులను గుర్తించారు. వీరందరికీ ప్రాంతీయ రవాణా కార్యాలయంలో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. తమ కుటుంబం కోసం, ఏదైనా ప్రమాదం సంభవించినపుడు ప్రాణాలను కాపాడుకోవడం కోసం హెల్మెట్ ధరించడం అవసరమని వారికి అవగాహన కల్పించారు. వచ్చే వారం రోజులపాటు జిల్లాలో హెల్మెట్ ధారణపై తనిఖీలు కొనసాగిస్తామని ఉపరవాణా కమిషనర్ చెప్పారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - బొబ్బిలి

ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఆర్‌డిఒ రామ్మోహనరావు సందర్శించారు. పట్టణంలోని వాసు, గాయత్రి జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం ఆంగ్లం పరీక్షను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పించాలని కోరారు. చూసి రాతలు జరగకుండా చూడాలన్నారు. ఆయనతో తహశీల్దార్ ఎం.శ్రీను ఉన్నారు.

ఆశావర్కర్లకు వేతనాలు పెంచాలి

6న విజయవాడ ధర్నాలో పాల్గొంటామని వైద్యాధికారులకు వినతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైద్యాధికారికి వినతినిస్తున్న ఆశావర్కర్లు

ఆశా వర్కర్లకు గతంలో అధికారులు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ మార్చి 6న రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా విజయవాడలో జరిగే ధర్నాలో పాల్గొంటున్నామని, ఆరోజు విధులకు హాజరు కాలేయమని తెలియజేస్తూ విజయనగరం అర్బన్, రూరల్ పిహెచ్‌సిల వైద్యాధికారులకు ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా నాయకులు వెంకటలక్ష్మి, మహాలక్ష్మి తెలిపారు. మంగళవారం జిల్లాలో వివిధ పిహెచ్‌సి ల్లో వైద్యులకు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశాలపై పనిభారం, ఒత్తిడి పెరుగుతున్నాయని, వేతనాలు మాత్రం పెరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26వేలు, లేబర్ హాలిడేస్, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం 10 లక్షలు ఇవ్వాలని, వేతనంతో కూడిన మెటర్నిటీ బెనిఫిట్, రిటైర్మెంట్ బెనిఫిట్, 62 సంవత్సరాల పెంపు, తదితర జీవోలు ఇవ్వాలని,ప్రభుత్వమే అన్ని రకాల రికార్డులు అందించాలని కోరుతూ విజయవాడ లో జరిగే ధర్నాలో పాల్గొంటున్నామన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సునీత, పద్మ ,కనకమహాలక్ష్మి, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంతో రోగ నివారణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రోగ నివారణకు ఆయుర్వేద వైద్యం ఎంతో మేలని సెంచూరియన్ వెల్‌నెస్ సెంటర్ డాక్టర్ విజయ్ కుమార్ అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాధులు వచ్చిన తరువాత జాగ్రత్తలు తీసుకోవడం కంటే అవి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంగళవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయుర్వేదం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు. ప్రాణం పోసే వాడు దేవుడు.. ప్రాణం నిలబెట్టే వాడే వైద్యుడు అనే నానుడి తెలిసిందేనన్నారు. ప్రస్తుతం ఆయుర్వేదంలో పంచకర్మ బాగా ప్రసిద్ధి చెందిందన్నారు. వాటిని పాటించడం ద్వారా వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చున్నారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డాక్టర్ ఆయేష్ కాంత్ జెనా, ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించని షాపులు సీజ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పన్ను చెల్లించని షాపులను కొన్నింటిని కార్పొరేషన్ రెవెన్యూ సిబ్బంది సీజ్ చేశారు. పన్ను వసూలు ప్రక్రియలో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందాలతో ఆస్తిపన్ను బకాయిల వసూళ్లు చేపట్టారు. అయితే కొంతమంది బకాయి దారులు ఇప్పటివరకు ఇంకా చెల్లించకుండా తాత్సారం చేయడంతో రెడ్ నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించకపోవడంతో కొన్ని దుకాణాలను మూసివేయించారు. గృహ ఆస్తి పన్ను దారులు పన్నులు చెల్లించని వారి 20 కుళాయి కనెక్షన్లను తొలగించారు. దీంతో కొంతమంది తక్షణమే స్పందించి పన్నులు చెల్లించేందుకు అంగీకరించారు.కమిషనర్ స్పందిస్తూ ప్రజలు పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి, ప్రజల మౌలిక సదుపాయాలు కల్పనకు సహకరించాలని కోరారు.

ఖాళీ స్థలాలను శుభ్రం చేయాలి

నగరంలో కొన్నిచోట్ల ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయని, ఆయా స్థలాలను శుభ్రం చేయాలని సిబ్బందిని కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం క్షేత్రస్థాయి పర్యటన భాగంగా 34 వ డివిజన్లో ఆయన పర్యటించారు. పారిశుధ్యం, వీధి దీపాలు, నీటి పంపిణీ, రహదారులు, కాలువలు వంటి మౌలిక సదుపాయాలను గమనించారు. ఇందిరానగర్, శ్రీరామ్ కాలనీ, గోపాల్ నగర్, కల్యాణి నగర్, ప్రదీప్ నగర్ తదితర ప్రాంతాలలో పర్యటించి, ప్రజల సమస్యలను తెలుసుకుని అవసరమైన సదుపాయాలు తక్షణమే కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. ఖాళీ స్థలాలు చెత్తాచెదారాలతో నిండి ఉండడానికి గమనించి వెంటనే ఆయా ప్రాంతాలలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

34వ డివిజన్‌లో పర్యటిస్తున్న కమిషనర్, సిబ్బంది

ప్రజాశక్తి
www.prajasakti.com

ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - బాడంగి

మండలంలోని గొల్లాది వద్ద వేగావతి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ బి.శంకరరావు, మాజీ ఎంపిటిసి ఆర్.పుండరీ కోరారు. ఇసుక అక్రమ తవ్వకాలను ఆపాలని కోరుతూ మంగళవారం ఆర్‌డిఒ రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక అక్రమ తవ్వకాలతో నది పరివాహక భూములు కోతకు గురవుతున్నాయని, భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు అడుగంటడంతో తాగునీటి బోర్లు, వ్యవసాయ బోర్లు ఎండిపోతున్నాయన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంగన్వాడీ కేంద్రాల్లో కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని ఉణుకూరు అంగన్వాడీ సెక్టార్ పరిధి 21 అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా మంగళవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఈ ర్యాలీలో పాల్గొని నినాదాలు చేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు ఇచ్చిన పలు రాజకీయ, ఉద్యోగ, ఇతర రిజర్వేషన్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోరాం కార్యకర్త సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి మంగళవారం మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పర్యావరణ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్ మెస్త్రీలు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలతో కలిసి పలు వార్డులు, ప్రాంతాల్లో పర్యటించారు. రామాటాకీస్ రోడ్డు, శ్వేతా చలపతి స్కూలు, గౌడ వీధి, రావువారి వీధి, గంగులవీధి, పాకీ వీధి ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్యాన్ని పరిశీలించారు. మస్టర్ కార్యాలయానికి హాజరై పారిశుధ్య కార్మికుల మస్టర్లను పరిశీలించారు. అన్ని సచివాలయాల వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలతో సమావేశం ఏర్పాటు చేసి ఇంకమ్ వసూలు కావలసిన ఫీజులను, పెనాల్టీలతో సహా వసూలు చేయాలని ఆదేశించారు. తదుపరి రామాటాకీస్ రోడ్డు, శ్వేత చలపతి స్కూలు ఏరియాలలో రోడ్లపై చెత్తలు వేయకుండా చూడాలని, కాలువలలో సిల్టు తొలగించాలని ఆదేశించారు. గౌడ వీధిలో నిర్మాణ దశలో ఉన్న ఇంటి వద్ద ఇంటి నిర్మాణ సామాగ్రి రోడ్లపై వేసి ఉండటం చూసి ఇంటి యజమానికి నోటీసులు జారీ చేయాలని పాదచారులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. గంగుల వీధి, పాకీ వీధి ఏరియాలలో కులాయి లీకులను వెంటనే అరికట్టాలని పైపులైన్ ఫిట్టర్‌కు ఆదేశించారు.

పాఠశాలను సందర్శించిన డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని కంటకాపల్లి హైస్కూల్‌ను డిప్యూటీ డిఇఒ కె. వెంకటరమణ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రధానంగా 10వ తరగతి పిల్లలకు పరీక్షలు రాయడంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. విద్యార్థులకు పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో తెలియజేశారు. పరీక్షలు రాయడానికి విద్యార్థులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. విద్యార్థులు ఏ విధంగా చదవాలి, ఒత్తిడికి లోనుకాకుండా బాగా పరీక్షలు రాసి మంచి మార్కులు ఎలా సంపాదించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.అరుణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పాటూరు సచివాలయం సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని పాటూరు గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ సి.హెచ్. సూర్యనారాయణ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఇందులో భాగంగా సిబ్బంది విధి నిర్వహణ, రిజిస్టర్ హాజరు పట్టిక, సిబ్బంది పనితీరును విధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది కార్యాలయంలో వచ్చే వేళలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఏ విధమైన అనుమతులు లేకుండా కార్యాలయం విడిచి పెట్టకూడదని, కార్యాలయానికి వచ్చిన సిబ్బందితో స్నేహభావంతో వారు తీసుకొచ్చిన దరఖాస్తులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- శృంగవరపు కోట

డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో యూనియన్ నియోజకవర్గ కన్వీనర్ కె. భీముడు డిమాండ్ చేశారు. వాహనమిత్ర 15 వేలు ఇవ్వాలని జిఒ నెం.21 అండ్ 31 రద్దు చేయాలని, డ్రైవర్లకు సంక్షేమ బోర్డు చేయాలని కోరుతూ ఎపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు మంగళవారం పాత బస్టాండ్ వద్ద దేవి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంపై పునరాలోచన చేయాలని, చంద్రబాబు అధికారంలోకి వస్తే ఆటో డ్రైవర్స్ అండ్ మోటారు కార్మికులకు వాహనమిత్ర రూ.15వేలు ఇస్తామని,డ్రైవర్లకు సంక్షేమ బోర్డు చేస్తామని, డీజిలు పెట్రోలు ధరలు తగ్గిస్తామని, టాటా మ్యాజిక్ వ్యాన్లు, జీపులు, కార్లుకు గ్రీన్ ట్యాక్స్, లేబర్ ట్యాక్స్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, టోలేట్ ఫీజులు తగ్గిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వాటన్నింటినీ నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవి ఆటో యూనియన్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - వేపాడ

ప్రతీ వ్యక్తి తన పుట్టిన రోజున ఖచ్చితంగా మొక్కలు నాటి, సంరక్షించాలనే సంప్రదాయాన్ని ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సొసైటీ కన్వీనర్ ఆర్.హరిబాబు అన్నారు. మంగళవారం ముకుందపురం గ్రామానికి చెందిన జామి శ్రావణి పుట్టినరోజు సందర్భంగా హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సొసైటీ ఆధ్వర్యంలో బొద్దాం గ్రామంలోని బృహలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉసిరి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఇంట్లో, పనిచేసే కార్యాలయాల్లో వేడుక ఏదైనా, సందర్భం ఏదైనా గుర్తుగా ఒక మొక్క నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో హరిత సొసైటీ సభ్యులు కడవంటి మహేశ్వరరావు, జామి హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - వంగర

మండలంలోని సంగాంలో గల సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద మహా శివరాత్రిని పురస్కరించుకొని వారం రోజులు పాటు నిర్వహించిన ఉత్స వాలకు సంబంధించి ఆదాయం మంగళవారం లెక్కింపు చేపట్టినట్లు ఆలయ ఇఒ పి. శ్యామలరావు తెలిపారు. ప్రత్యేక దర్శనం టికెట్లు ద్వారా రూ.3,04,220, శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,17,500, విరాళాల ద్వారా రూ.14,319, హుండీ ద్వారా రూ.1,32,369, ప్రసాదాల ద్వారా రూ.97,500, మొత్తం రూ.7,65,908 ఆదాయం వచ్చిందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బోను ఆనందరావు, బొడ్రోతు శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు సిద్ధాంతం గణపతిరావు, ఎస్ రమేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎడ్ల పరుగు ప్రదర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని పాటూరు రాతి క్వారీలు వద్ద అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ పోటీల్లో 10 ఎడ్ల బళ్ళు పాల్గొని తలబడ్డాయి. విజేతలుగా నిలిచిన ఎడ్ల బళ్ళు యజమానులకు క్వారీ యాజమాన్యం, గ్రామ సర్పంచ్ కె.వెంకటలక్ష్మి, గ్రామ పెద్ద కె రమణమూర్తి, అరిగిపాలం ఎంపిటిసి టివి రమణ చేతుల మీదుగా నగదు బహుమతులను అందించారు.

సామాజిక సేవలో ఆర్యవైశ్యులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సామాజిక సేవలో ఆర్యవైశ్యులు ఎప్పుడూ ముందుంటారని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. మంగళవారం ఉల్లి వీధిలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన శ్రీ వాసవి ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఆర్యవైశ్యులు కేవలం వ్యాపారానికే పరిమితం కాకుండా సామాజిక సేవలోనూ ముందుంటారన్నారు. విజయనగరం ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా నిరుపేద ఆర్యవైశ్య విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ, హాస్టల్ భవనం నిర్మాణం చేయడం, వైద్య శిబిరాలు ఏర్పాటు, నిరుపేద ఆర్యవైశ్య మహిళల వివాహాలకు ఆర్థిక సాయం చేయడం గొప్ప విషయమన్నారు. కార్యదర్శి సీతారామయ్య శెట్టి, అధ్యక్షులు కుమ్మరిగుంట శ్రీనివాసరావు మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు వివి సత్యనారాయణ, కార్యదర్శి పచ్చిగుళ్ల రామారావు, కోశాధికారి వల్లంపాటి ఉపేంద్ర తో పాటు కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బొబ్బిలి

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 6న చేపట్టనున్న చలో విజయవాడను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, ఆశ కార్యకర్తల యూనియన్ నాయకులు ఎం.లక్ష్మి కోరారు. స్థానిక సిహెచ్‌సి వద్ద మంగళవారం ఆశ డే నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఆశ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆయా హామీలను అమలు చేయాలని ఈనెల 6న చేపట్టనున్న చలో విజయవాడను జయప్రదం చేయాలని కోరారు. కనీస వేతనాలు ఇచ్చి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని వాడాడ పిహెచ్‌సి వద్ద ఆశ వర్కర్లు నిరసన తెలిపి తమ సమస్యలు పరిష్కారం కోసం చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ప్రాథమిక ఆసుపత్రిలో వైద్యులు ఆదిత్య చక్రవర్తికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు శంకరరావు, సురేష్ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీలను జీవో రూపంలో ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. దీనిపై చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శశికళ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బొబ్బిలిలో ఆశావర్కర్లనుద్దేశించి మాట్లాడుతున్న శంకరరావు

14న జనసేన ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనసేన పార్టీ ఆవిర్భావ వేడులను జయప్రదం చేయాలని జిల్లా లోని జనసైనికులకు జనసేన నాయకలు, ఎపి తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్వి, గురాన అయ్యలు, పడాల అరుణ కోరారు. విజయనగరం లోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆవిర్భావ వేడుకలకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం వీరంతా మీడియాతో మాట్లాడారు. జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలకు సంబంధించి ప్లీనరీ కమిటీలో విజయనగరం నుంచి నాతో పాటు గురాన అయ్యలు, పడాల అరుణను కూడా కమిటీ మెంబర్స్‌గా నియమిస్తూ పార్టీ తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేసారు. గురాన అయ్యలు మాట్లాడుతూ, పార్టీ ఆవిర్భావ వేడుకల్లో తనను లాజిస్టిక్ కమిటీ సభ్యునిగా నియమించినందుకు పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

అవంతిలో 2కె25 సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని బసవపాలెం గ్రామంలో ఉన్న అవంతి రీసెర్చ్ అండ్ టెక్నాలజీ అకాడమీలో నేషనల్ లెవెల్ టెక్ ఫెస్ట్ టెక్ విశిష్టత2కె25 వైజ్ఞానిక సదస్సు మంగళవారం ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరగనున్న ఈ కార్యక్రమాన్ని అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక రంగాలలో ఉద్యోగ అవకాశాలు విస్తృత స్థాయిలో అందుబాటులో ఉన్నాయన్నారు. పాఠ్య పుస్తకాల్లోని మూల సిద్ధాంతాలు వాటి ప్రయోగాత్మక నైపుణ్యంపై అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికీ ఉద్యోగ సాధన కోసం ప్రాక్టికల్ నాలెడ్జ్ ముఖ్యమైందని ఉద్ఘాటించారు. విద్యార్థులకు తరగతి గదిలో చెప్పే పాఠాలతో పాటు ప్రయోగశాల పరిజ్ఞానం కూడా కీలకమని తెలిపారు. ఈ ఉత్సవానికి వివిధ కళాశాలలు నుండి సుమారు 2వేల మంది విద్యార్థులు పాల్గొని 82 ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను, వాటి ఉపయోగం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సాంకేతిక ఉత్సవంలో టెక్నికల్ క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పేపర్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రెజంటేషన్స్, ఎక్స్‌పర్ట్ టాక్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.సుజాత, ప్రొఫెసర్లు ఆర్వి రాజ్‌కుమార్, డాక్టర్ వెంకట కృష్ణారావు, ఇండస్ట్రీస్ సొల్యూషన్ వైస్ ప్రెసిడెంట్ బి.చైతన్య, విశ్రాంతి ప్రొఫెసర్ టి నారాయణ, అవంతి కళాశాల ప్రతినిధి మహేష్, ప్రిన్సిపాల్ గోవింద్, వైస్ ప్రిన్సిపల్ భాస్కరరావు, మల్లేశం, ఎఒ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

పని దినాలు తగ్గితే కూలీలకు నష్టం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఉపాధి హామీ నిధులు అభివృద్ధి పనులకు మళ్లించడంతో ఉపాధి కూలీలకు పని దినాలు తగ్గి వేతనాలు కోల్పోతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు అన్నారు. మండలంలోని గౌరీపురం చెరువులో ఉపాధి హామీ కార్మికులు పని పనిచేస్తున్న పని ప్రదేశాల వద్దకు వెళ్లి ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ చట్టం ప్రకారం మెటీరియల్ వర్కులకు 10శాతం మాత్రమే ఖర్చు చేయాలి కానీ నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ నిధులను దారి మళ్లించి సిసి రోడ్లు, తారురోడ్లు డ్రైనేజీ కాలువలు, ప్రభుత్వ భవనాలు కట్టించి నిధులను దారిమళ్లిస్తుందన్నారు. కేంద్రంలో బిజెపి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉపాధిహామీ చట్టానికి కేటాయించవలసిన రూ.16వేల కోట్ల బడ్జెట్‌లో కోత విధించారని దీని కారణంగా ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు తగ్గి వేతనాలను కోల్పోతున్నారని అన్నారు. ఉపాధి హామీ నిధులు దారి మళ్లించడం వల్ల అధికారపక్షం ప్రతిపక్షానికి చెందిన కాంట్రాక్టర్లు మాత్రమే లబ్ధి పొందుతారని ఇటువంటి పనులు మానుకొని రైతన్నలకు కూలీలకు అండగా ఉన్న ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్ ఎక్కువ కేటాయించి పటిష్టంగా అమలు చేయాలని కోరారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఏడాదిలో 200 రోజులు పని దినాలు కల్పించాలని బకాయి ఉన్న ఆరు వారాల బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిత్యవసర వస్తువుల ధరలకు అనుకూలంగా కూలీలకు రోజు కూలి 600 రూపాయలు నిర్ణయించి అమలు చేయాలని ఎన్‌ఎంఎంఎస్ యాప్ రద్దు చేయాలని, రెండు పూటల పని ఆపి ఒక పూటే నిర్వహించాలని, పని ప్రదేశాల్లో టెంటు మెడికల్ కిట్లు ఒక ఎఎన్‌ఎంని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం మేట్లకు ఇస్తానన్న గౌరవ వేతనం రూ.7,500 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న విజయవాడలో జరుగు కార్యక్రమానికి ఉపాధి కూలీలంతా కదిలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న గాడి అప్పారావు

రెవెన్యూ అధికారులపై ఆర్‌డిఒ ఆగ్రహం

ప్రజాశక్తి - కొత్తవలస

గ్రీన్ ఫీల్డ్ హైవే భూముల రైతు సమస్యలు రెవెన్యూ అధికారులకు పట్టవా అని విజయనగరం ఆర్‌డిఒ దాట్ల కీర్తి రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఉత్తరాపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే భూముల రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూములు కోల్పోయింది రైతులని అధికారులు కాదని, అధికారులు ఎందుకింత ఆలస్యం చేస్తున్నారో తెలియదని స్థానిక తహశీల్దార్‌పై మండిపడ్డారు. రైతులు ఎవరు ఆందోళన చెందనవసరం లేదని, హైవే కోసం భూమిని కోల్పోయిన రైతులందరికీ నష్టపరిహారం వర్తించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇకపై రైతులు మీ సమస్యను అధికారులు పట్టించుకోకపోతే స్వయంగా తన కార్యాలయానికి వచ్చి చెప్పాలని రైతులకు సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దార బి.నీలకంఠారావు, ఎంఆర్‌ఐ రాజేష్, రైతులు సింగంపల్లి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు పరిశీలన

స్థానిక వాగ్దేవి జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను ఆర్‌డిఒ సందర్శించారు. కళాశాలలో పరీక్షలు జరుగుతున్న అన్ని తరగతి గదులను నిశితంగా పరిశీలించారు. ఈ కేంద్రంలో పరీక్షలు జరుగుతున్న తీరును సీసీటీవీ కెమెరాల ద్వారా పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈమె వెంట స్థానిక తహశీల్దార్ బి. నీలకంటారావు, ఎం ఆర్ఐ రాజేష్, కాలేజీ కరస్పాండెంట్ మహేశ్వరరావు ఇతర సిబ్బంది ఉన్నారు.

సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కీర్తి

భీమసింగి కార్మికులకు అండగా ఉంటాం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి - జామి

భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, సుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగ సంఘాల నేతలతో అమరావతి సచివాలయంలో మంత్రి కార్యాలయంలో సమావేశమై రైతులు, ఉద్యోగుల సమస్యలతో పాటు వారికి అందవలసిన పీఎఫ్, గ్రాట్యుటీ కోసం చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఏటికొప్పాక, తాండవ, భీమసింగి సుగర్స్ కార్మికులకు చెల్లించాల్సిన బకాయిల కోసం తగిన చర్యలు తీసుకుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుమతి తీసుకొని తగిన చర్యలు వెంటనే తీసుకుంటామని కార్మిక సంఘాల నాయకులకి హామీ ఇచ్చారు. కార్మికులు, ఉద్యోగులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎవరూ అధైర్య పడాల్సిన పనిలేదని కచ్చితంగా న్యాయం చేస్తామని చెప్పారు.

లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి మాట్లాడుతూ సక్రమంగా క్రసింగ్ జరుగుతున్న ఫ్యాక్టరీని గత ప్రభుత్వంలోని పెద్దలు అవగాహన లోపంతో మూసివేసి రైతులను, కార్మికులను రోడ్డున పడేసారని కూటమి ప్రభుత్వం ఫ్యాక్టరీని తిరిగి తెరిపించినా, లేక మరో విధంగా ఉపయోగించుకున్నా పర్లేదని, రైతులను, కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ప్రభుత్వ కార్యదర్శి పరిశ్రమల శాఖ యువరాజ్, కార్మిక సంఘాల నేతలు, టిడిపి నాయకులు పొలుపర్తి స్వామినాయుడు, జాగరపు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నెల్లిమర్ల: కొండవెలగాడ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని డిఇఇ పి.త్రినాధరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. కొండవెలగాడ 33/11/ కెవి సబ్ స్టేషన్ పరిధిలో కొండ వెలగాడ ఎస్ఎస్‌హెచ్ క్యూ ఫీడర్, పారసాం 11కెవి రూరల్ ఫీడర్, తాళ్లపూడి పేట 11కెవి రూరల్ ఫీడర్ లైన్ కింద వ్యసాయం కనెక్షన్ పనులు, చెట్టుకొమ్మలు తొలగించడం, సాంకేతిక సమస్యలు వాటిని సరి చేస్తామన్నారు. దీంతో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు కొండవెలగాడ, చంద్రంపేట, తాళ్లపూడిపేట, టెక్కలి, ఎల్ఎన్‌పురం, తుమ్మలపేట, చిన బూరాడపేట, పారసాం, గెద్ద పేట, పెద బూరాడ పేట, గుర్ల మండలం ఆనందపురం గ్రామాలకు విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదార్లు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకుని జరజాపేట ఉన్నత పాఠశాలలో మంగళవారం స్థానిక పోలీసులు మహిళల వేధింపులు, భద్రత పై అవగాహన కల్పించారు. అపంతం ఎస్ఐ బి. గణేష్ పిల్లలకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సామాజిక మధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, స్వీయ రక్షణ అవసరమని అన్నారు. పని ప్రదేశాల్లో భద్రతపై దృష్టి సారించి మహిళలు వేధింపులు గురికాకుండా ఎదుర్కోవాలన్నారు. సమాజంలో మహిళలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని కొండవెలగాడలో పేద కుటుంబానికి కెవిడి ఎంప్లాయిస్, విజయదుర్గాయూత్ ఆర్థిక సాయం అందజేశారు. మంగళవారం స్థానిక విజయరామరాజు కాలనీకి చెందిన ఉజ్జి లక్ష్మి ఆనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. ఈ నేపథ్యంలో తనది నిరుపేద కుటుంబం కావడంతో దహన సంస్కారాలు నిమిత్తం విజయదుర్గా యూత్, కెవిడి ఎంప్లాయిస్ యూనియన్ కలిసి రూ.20వేలును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు విజయదుర్గా యూత్, కెవిడి ఎంప్లాయిస్‌ను అభినందించారు.

పనులను అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎస్‌కోట పంచాయతీ పరిధిలో గల రేగపుణ్యగిరి రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకుడు వబ్బిన సన్యాసి నాయుడు డిమాండ్ చేశారు. రేగ పుణ్యగిరి గిరిజనులతో కలిసి మంగళవారం డిప్యూటి తహశీల్దార్ భరత్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉపాధిహామీ నిధులు రూ.4 కోట్లు కేటాయించి 3.5 కిలోమీటర్లు రోడ్డుకు శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించినప్పటికీ దిగువ గ్రామంలో ఉన్న కొంతమంది వ్యక్తులు దౌర్జన్యంగా పనులు నిలుపుదల చెయించారని అన్నారు. రోడ్డు పనులకు ఆటంకం లేకుండా చేయాలని, ఫారెస్ట్ అనుమతులు కూడా త్వరగా వచ్చేలా చూడాలని జిల్లా కలెక్టరుకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశామని గుర్తు చేశారు. ఆయన ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి పరిష్కారమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారని కలెక్టర్ కార్యాలయం నుండి ఆదేశాలు వచ్చిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేలా చూడాలని డిప్యూటీ తహశీల్దార్‌ను కోరారు.

నమ్మకంతోనే గెలిపించాం :ఎపిటిఎఫ్

రామభద్రపురం: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం గాదె శ్రీనివాసులునాయుడుతోనే సాధ్యమని అందుకే ఆయనకు ప్రాదాన్యత పరంగా ఓట్లు వేసి గెలిపించామని స్థానిక ఎపిటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు బొప్పే రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎపిటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు ఆయనపై నమ్మకం ఉంచి ఎమ్మెల్సీగా గెలిపించడం మంచి పరిణామమన్నారు. గతంలో కూడా శ్రీనివాసులునాయుడు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో కీలక భూమిక పోషించారన్నారు. ఇప్పటికే ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయ సంఘ నాయకులు మిఠాయిలు పంచుకొని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు డోకల రఘురాంనాయుడు, కాగాన సత్యారావు, కర్రి శ్రీ నివాసరావు, గంగాధర్, సువ్వాడ వెంకటప్పారావు, పూసర్ల విశ్వేశ్వరరావు, వసంతుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తాళాలు వేసి ఉన్న సచివాలయం

సమయం పాటించరా?

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక మున్సిపాలిటీలోని వార్డు సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. పట్టణంలోని సాయి గణపతి థియేటర్‌కు ఎదురుగా ఉన్న సచివాలయం మంగళవారం ఉదయం 11.15 గంటల వరకు తెరుచుకోలేదు. సచివాలయానికి తాళాలు వేసి ఉండడంతో వివిధ పనులు కోసం వచ్చిన ప్రజలు వెనుదిరిగారు. సచివాలయాల పనితీరుపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వారికి నచ్చిన సమయానికి ఉద్యోగులు వచ్చి వెళ్తున్నారు. సమయపాలన పాటించని ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

ఇష్టంగా చదవాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

చదివేటప్పుడు కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని మానసిక కౌన్సిలర్ డాక్టర్ గేదెల సత్తిబాబు అన్నారు. పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాల సౌజన్యంతో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరీక్షల సమయంలో ఒత్తిడిని భయాన్ని ఏ విధంగా అధిగమించుకోవాలో మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమయపాలన పాటించాలని, క్రమశిక్షణ కలిగి ఉండాలని, ఏదైనా తాను సాధిస్తాను అనే పాజిటివ్ మైండ్‌తో ఉండాలని చెప్పారు. ప్రతి వ్యక్తికి పవర్‌ఫుల్ వెపన్ తమ మైండ్ సెట్ అని క్షుణ్ణంగా వివరించి ఆటపాటలు ఉదాహరణలతో అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు టీచర్లకు లోబడి వారిచ్చే సలహాలను పాటించి విద్యార్థి దశలో చదువుకునేటప్పుడు ప్రతి విషయం పట్ల కొత్త కొత్త విషయాలు నేర్చుకో వడానికి ఇష్టపడుతూ ముందుకు వెళ్లాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బాలమణి, స్వప్న, సత్యవేణి, శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయం మూసివేతపై నివేదిక ఇవ్వండి: కలెక్టర్

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురంలో సచివాలయం మూసివేత పై జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను నివేదిక కోరారు. ఈనెల 1వ తేదీన భోగాపురం-1 సచివాలయాన్ని మధ్యాహ్నం ఒంటిగంట వరకు తెరవలేదు. దీనిపై ప్రజాశక్తిలో తెరుచుకోని సచివాలయం అనే ప్రత్యేక కథనం వెలువడింది. దీనిపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆయన కోరారు.

కూటమి ప్రభుత్వానికి కౌంట్ డౌన్ : బొత్స

ప్రజాశక్తి- గజపతినగరం

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి కౌంట్ డౌన్ మొదలైందని, ఇందుకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఫలితాలే నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తొమ్మిది నెలల కూటమి ప్రభుత్వ పాలన పట్ల మేధావుల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. ఉపాధ్యాయులు, టిడిపి, జనసేన బలపరిచిన పాకలపాటి రఘువర్మ ఓటమితో కూటమికి చెంపపెట్టు అన్నారు. ఓటమని హుందాగా అంగీకరించకుండా, టిడిపి నేతలు డొంక తిరుగుడు మాటలు మాట్లాడుతున్నారన్నారు. తొమ్మిది నెలల పాలనలో ఉపాధ్యాయులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడం వల్లే, ఉపాధ్యాయులు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం నేర్పారన్నారు. అబద్ధాల హామీలతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఏ ఒక్క హామీని ఇప్పటివరకు అమలు చేయకపోవడం చంద్రబాబు అసమర్ధ పాలనకు నిదర్శనమన్నారు. పవన్ కళ్యాణ్‌ను తృప్తి పరిచేందుకే పోసాని కృష్ణమురళిపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారన్నారు. పరిపాలన గాలికి వదిలేసి, వైకాపా నేతలపై ఈ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి గార తౌడు, మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, సర్పంచ్ బెల్లాన త్రినాధ రావు, ఉపసర్పంచ్ మండల సురేష్, పిఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కుక్కలు పట్టివేత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వివిధ ప్రాంతాలలో విచ్చలవిడిగా తిరుగుతున్న వీధి కుక్కలను అదుపులోకి తీసుకొని వాటికి సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు, యాంటీ రాబిస్ వ్యాక్సిన్ చేయించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. మంగళవారం వివిధ ప్రాంతాలలో ప్రత్యేక సిబ్బంది కుక్కలను అదుపులోకి తీసుకున్నారు. వాటిని కొత్తపేటలో ఉన్న డాగ్ స్టెరిలైజ్ సెంటర్ కు తరలించి సంతాన నిరోధక శస్త్ర చికిత్స అనంతరం ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచి ఆరోగ్యంగా ఉన్న కుక్కలను ఎక్కడి నుంచి అదుపులోకి తీసుకున్నారో మరలా అక్కడే విడిచి పెట్టారు.

IN THE HON'BLE COURT OF
THE JUNIOR CIVIL JUDGE
AT: KOTHAVALASA
Between: O.S.2/2023
Sri Mutchakarla Prasad ...Plaintiff
And
Thurupati Venkata Lakshmi &
2 others ...Defendants
SUMMONS
To,
D-1: Thurupati Venkata Lakshmi, W/o. Thurupati late Appalasanyasi Karunakarudu, R/at D.No.4-21, Golgam Village, Lakkavarapukota Mandal, Vizianagaram District.
D-2: Thurupati Sunitha, D/o. late Appalasanyasi Karunakarudu, R/at #4-21 Golgam Village, Lakkavarapukota Mandal, Vizianagaram District.
D-3: Thurupati Sairam, S/o. late Appalasanyasi Karunakarudu, R/at #4-21 Golgam Village, Lakkavarapukota Mandal, Vizianagaram District.
ఇందుమూలంగా 1, 2 & 3 ప్రతివాదులకు తెలియజేయునది ఏమనగా పైనెంబరు దావాలో శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు సమన్లు పేపరు ప్రకటన ద్వారా మీకు ఆర్డరు వేసినారు. కావున మీకు **తేది. 20-03-2025**కి వాయిదా అయివున్నది. సదరు తేదిన మీరు ఉ॥గం॥ **10.30ని॥**లకు పైకోర్టువారి ఎదుట స్వయంగా గాని లేదా లాయరు గారి ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనియెడల మీపరోక్షములో దావా విచారణ చేసి తీర్మాణించబడునని తెలియజేయడమైనది.
(By Order of the Hon'ble Court)
Y. PRATHAP KUMAR & CH.V.A. RAO(Venkat)
Advocates, Visakhapatnam.
Cell: 9866510995, 9290595769

IN THE HON'BLE COURT OF
THE JUNIOR CIVIL JUDGE
AT: KOTHAVALASA
I.A 1/2023 in O.S.2/2023
Between:
Sri Mutchakarla Prasad
...Petitioner/Plaintiff
And
Thurupati Venkata Lakshmi &
2 others ...Respondents/Defendants
NOTICE
To,
R-1: Thurupati Venkata Lakshmi, W/o. Thurupati late Appalasanyasi Karunakarudu, R/at D.No.4-21, Golgam Village, Lakkavarapukota Mandal, Vizianagaram District.
R-2: Thurupati Sunitha, D/o. late Appalasanyasi Karunakarudu, R/at #4-21 Golgam Village, Lakkavarapukota Mandal, Vizianagaram District.
R-3: Thurupati Sairam, S/o. late Appalasanyasi Karunakarudu, R/at #4-21 Golgam Village, Lakkavarapukota Mandal, Vizianagaram District.
ఇందుమూలంగా 1, 2 & 3 రెస్పాండెంట్లకు తెలియజేయునది ఏమనగా పై నెంబరు పిటీషన్‌లో శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు నోటీసులు పేపరు ప్రకటన ద్వారా మీకు ఆర్డరు వేసినారు. కావున మీకు **తేది. 20-03-2025**కి వాయిదా అయివున్నది. సదరు తేదిన మీరు ఉ॥గం॥ **10.30ని॥**లకు పైకోర్టువారి ఎదుట స్వయంగాగాని లేదా లాయరు గారి ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనియెడల మీపరోక్షములో పిటీషన్ విచారణ చేసి తీర్మాణించబడునని తెలియజేయడమైనది.
(By Order of the Hon'ble Court)
Y. PRATHAP KUMAR & CH.V.A. RAO(Venkat)
Advocates, Visakhapatnam.
Cell: 9866510995, 9290595769

మహారాజ శ్రీ రాజాం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి సముఖమునకు
E.P.No. 8/2022, O.S.No.. 129/2020
బోనెల వేణుబాబు ---DHR
పాలవలస రాము ----JDR
పై నెంబరు అమలు పైకం గల రాబట్టే నిమిత్తం సదరు JDR తాలూకా ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని పైకోర్టులో తే.12.03.2025 దిన ఉ॥ 10:30 గం॥ల నుండి బహిరంగ వేలం కాబడును.
షెడ్యూలు:- శ్రీకాకుళం జిల్లా, రాజాం మండలం మరియు నగరపంచాయితీ మెయిన్ రోడ్డుకు ఉత్తర శ్రేణిలో యున్నటువంటి తూ॥ ప॥ 9.5 అడుగులు (2.89 మీటర్లు), ఉ॥ ద॥ 20 అడుగులు(6.1 మీటర్లు) గల S.NO.109/P, bearing Door No. 3-4-38 గల డాబా ఇంటికి హద్దులు.
తూర్పు - యూనియన్ ఆఫీసు
దక్షిణ - రోడ్డు,
పడమర- కొండపర్తి జయమ్మ గారి డాబా ఇల్లుకు, యీ ఆస్తికి మధ్య సమిష్టి గోడ
ఉత్తర - సి.సి.రోడ్డు
Ameen Value of **Rs. 5,00,000/-**
DHR Value of 1/2 share **Rs. 1,50,000/-**
JDR Value of Rs. Nill
పై షెడ్యూలు ఆస్తిలో JDRకి చెందిన 1/2 వాటాకి వేలం వేయబడును.
వై. సత్యశ్రీనివాస్
న్యాయవాది,
రాజాం, విజయనగరం జిల్లా.